క్లుప్తంగా

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకుడు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్ బాబా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

రిటైర్డ్ రైల్వే ఉద్యోగికి సత్కారం


మోహనరావును సత్కరిస్తున్న లెవెన్ స్టార్ అసోసియేషన్ సభ్యులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ డీజిల్ లోకో షెడ్‌లో సీనియర్ టెక్నీషియన్‌గా విధులు నిర్వర్తించి పదవీ విరమణ చేసిన కె.మోహనరావును రైల్వే న్యూకాలనీ లెవెన్ స్టార్ అసోసియేషన్ సభ్యులు స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఘనంగా సత్కరించారు. రైల్వేలో సుదీర్ఘకాలం పాటు సేవలందించి రిటైరైన తమ మిత్రుడు, అసోసియేషన్ సభ్యుడు మోహనరావు శేషజీవితం ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షిస్తున్నట్లు వీరు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నంద శ్రీనివాస్, బోని శ్రీనివాస్, శ్రీరామ్, వై.శ్రీను, పట్నాల నాగరామ్మోహనరెడ్డి, అప్పలరాజు, పుచ్చే శేఖర్‌రెడ్డి, సత్యనారాయణ, జాన్ రవి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, ఉద్యోగులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన సేవను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తర పూజ జరిపారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలో ఉదయం ఈ సేవను నిర్వహించారు.

యోగాసన పోటీల్లో ప్రతిభ



బంగారు పతకం అందుకుంటున్న పుష్పలత

విశాఖ విద్య: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎంవీపీ కాలనీలో జరిగిన జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో ఎన్ఏడీ ఏపీఎస్ఈబీ కాలనీకి చెందిన యోగా ట్రైనర్ నీలాపు పుష్పలత మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. నిర్వాహకులు ఆమెకు బంగారు పతకం, సర్టిఫికెట్ అందజేశారు.

- హైవేలో బస్సులు ఆగేది ఒకచోట.. షెల్టర్లు మరోచోట
- ఎండావానల్లో తలదాచుకోలేని దుస్థితి
- ప్రయాణికుల ఇబ్బందులు పట్టించుకోని అధికారులు
- అవసరమైన ప్రాంతాల్లో బస్ బేలు నిర్మించాలని విజ్ఞప్తి


జాతీయ రహదారి ఊర్వశి కూడలి వద్ద బస్సు కోసం ఎండలో నిరీక్షిస్తున్న విద్యార్థులు, ప్రయాణికులు

నిలువ నీడ కరువు


బిర్లా కూడలి వద్ద చెట్ల నీడలో వేచి ఉన్న ప్రయాణికులు


బిర్లా జంక్షన్‌లో నిరుపయోగంగా బస్ షెల్టర్

మురళీనగర్: మురళీనగర్–ఊర్వశి జంక్షన్ జాతీయ రహదారిలో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండైనా.. వానైనా ఆరుబయట బస్సుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, కార్యాలయాలు, విద్యాలయాలు ఎక్కువగా ఉన్నాయి. దూరప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి పోయే ఉద్యోగులు, నగరానికి వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించడానికి అనువైన చోట షెల్టర్లు లేవు. ఉన్నవి కూడా బస్సులు ఆగే ప్రాంతాల్లో లేకపోవడం వల్ల ప్రయాణికులు అవస్థలకు గురవుతున్నారు.

బస్సులకు అడ్డంగా ఆటోలు

బస్సులు ఆగేచోట ఆటోలు ప్రయాణికుల కోసం వస్తూ ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తున్నాయి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రయాణికులు బస్సులను అందుకోలేని పరిస్థితి ఏర్పడుతోంది. కంచరపాలెం 5వ పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న బస్ షెల్టర్ల వద్ద జీబ్రా క్రాసింగ్‌పై ప్రైవేటు బస్సులు, ఆటోలు నగరానికి వెళ్లే బస్సులకు అడ్డంగా ఆపడంతో జనం బస్సులను మిస్ అవుతున్నారు. పైగా రహదారి దాటేవారు ప్రమాదాల పాలవుతున్నారు. ఈ సమస్యపై ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోలేదని పలువురు విమర్శిస్తున్నారు. ఊర్వశి కూడలిలో జాతీయ రహదారికి ఇరువైపులా పాలిటెక్నిక్ కాలేజీ, కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ, ఐటీఐలు ఉన్నాయి. వీటిలో చదివే వందలాది మంది విద్యార్థులు నగరంలోని విద్యా సంస్థలకు దూరప్రాంతాల నుంచి బస్సుల్లో వస్తుంటారు. వీరు సాయంత్రం కాలేజీలు విడిచిపెట్టిన వెంటనే ఒకేసారి హైవేకు చేరుకుంటారు. డివైడర్ల వద్ద బస్సుల కోసం వేచి ఉండి తమ నివాస ప్రాంతాలకు వెళ్తున్నారు. ఇలాంటి చోట్ల కనీసం రెండు నిమిషాలు కూడా బస్సులు ఆగటం లేదు. ఇతర ప్రయాణికులు ఈ బాధ పడలేక ఆటోల్లో వెళ్తున్నారు.

బస్ బేలు అవసరం

బీఆర్‌టీఎస్ రహదారిలో మాదిరిగా హైవేలో డివైడర్లు వెడల్పు చేసి బస్ బేలు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. బిర్లా కూడలి, ఊర్వశి కూడలి వంటి ప్రధాన ప్రాంతాల్లో షెల్టర్లు నిర్మించాలి. బస్సుల రాకపోకల వివరాలు, అత్యవసర సమయాల్లో సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు ప్రదర్శించాలి. జాతీయ రహదారిపైకి ఆటోలు ప్రయాణం నిరోధించి ప్రమాదాలు నియంత్రించాలి. జాతీయ రహదారుల సంస్థ, ఆర్టీసీ సంస్థ పూర్తి సహకారం అందించాల్సి ఉంది.

నిత్యం రద్దీ


ఊర్వశి కూడలిలో బస్సు ఎక్కుతున్న విద్యార్థులు

జాతీయ రహదారిని ఆనుకుని 49, 50 వార్డుల మురళీనగర్, మాధవధార తదితర కాలనీలున్నాయి. సుమారు లక్షా 50 వేల మంది జనాభా కలిగిన ప్రాంతం కావడంతో ఇక్కడి రహదారులు నిత్యం ప్రయాణికుల రాకపోకలతో రద్దీగా కనిపిస్తాయి. ఇక్కడి హైవేను ఆనుకుని కార్ల షోరూమ్‌లు, మార్ట్‌లు ఇతర వ్యాపార కేంద్రాలు ఎక్కువగా ఉన్నాయి. జాతీయ రహదారి ఎగువన మురళీనగర్, మాధవదధారను ఆనుకుని అధికంగా మురికివాడలున్నాయి. ఈ ప్రాంత నివాసులు నిత్యం పనుల మీద నగరానికి, ఇతర దూర ప్రాంతాలకు వెళ్తూ ఉంటారు. వీరందరూ బస్సులపై ఆధారపడి ప్రయాణిస్తారు.

ఉన్నా.. లేనట్టే..!

హైవేలో మాధవధార, ఆర్‌అండ్‌బీ కూడలి, బిర్లా జంక్షన్, ఊర్వశి కూడలి, కంచరపాలెం, తాటిచెట్లపాలెం ప్రాంతాల్లో నిర్మించిన బస్ షెల్టర్లు నిరుపయోగమవుతున్నాయి. జాతీయ రహదారిలో జనం నిలిచే చోట, బస్సులు ఆగే ప్రాంతాలు, కూడళ్లలో షెల్టర్లు నిర్మించకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. సర్వీస్ రోడ్లను ఆనుకుని బస్ షెల్టర్లు నిర్మించడంతో ఇవి ప్రయాణికులకు ఉపయోగపడటం లేదు. ఊర్వశి కూడలి, మర్రిపాలెం ప్రాంతాల్లో సర్వీస్ రోడ్ల వద్ద ఒకే చోట మూడేసి బస్ షెల్టర్లు ఉన్నా.. ఎందుకూ కొరగాకుండా పోతున్నాయి. షెల్లర్ల వైపు బస్సులు రావడం లేదు. ఇలాంటి చోట ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయి. కొన్ని చోట్ల షెల్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. హైవేను ఆనుకుని ఉన్న డివైడర్లపై ప్రయాణికులు ఎండా, వానల్లో చెట్ల నీడ కింద తల దాచుకుంటున్నారు.


ఊర్వశి జంక్షన్ సర్వీస్ రోడ్డులో ఒకే చోట నిరుపయోగంగా మూడు బస్ షెల్టర్లు

నృత్య కళలను ప్రోత్సహించాలి


గజ్జె పూజ చేసిన విద్యార్థినులతో ఎం.వి.రాజశేఖర్ తదితరులు

తాటిచెట్లపాలెం: భారతీయ సంప్రదాయంలో భాగమైన నృత్య కళలను తప్పనిసరిగా ప్రోత్సహించాలని ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ అన్నారు. శంకర మఠం ఎదురుగా గల పద్మశాలి భవన్‌లో ఆదివారం శ్రీ నటరాజ నృత్యనికేతన్ వ్యవస్థాపకుడు, నాట్యగురువు నటరాజ పరమేశ్వరన్ సారథ్యంలో విద్యార్థినులచే ఘనంగా గజ్జె పూజ చేయించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ నృత్య కళాకారులతోనే సాంస్కృతిక వైభవం కలుగుతుందన్నారు. కళాకారుల కోసం నాట్యగురువు నటరాజ పరమేశ్వరన్ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో కె.సన్యాసిరావు, టి.వెంకటేశ్వర్లు, కె.సత్యనారాయణ, బి.పి.ఎస్.కల్యాణి, వి.కృష్ణమోహన్, విద్యార్థినులు, వారి తల్లితండ్రులు, భక్త మార్కండేయ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ర్యాలీ

ఆరిలోవ: కూటమి ప్రభుత్వం ఇళ్లకు అమర్చుతున్న అదానీ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆరిలోవలో వామపక్ష ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ చేపట్టారు. ఆరిలోవ ఆఖరి బస్టాప్ నుంచి దుర్గాబజార్ మీదుగా టి.ఐ.సి.పాయింట్, అంబేడ్కర్ కూడలి వరకు సాగింది. అదానీ స్మార్ట్ మీటర్లు మాకొద్దు.. ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని నినాదాలతో ర్యాలీ చేస్తూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. విద్యుత్ సమస్యలపై ఈ నెల 5న గురుద్వారా సమీపంలోని ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మానవాళి రక్షణలో మడ అడవులు కీలకం


విద్యార్థులకు మడ అడవులు, పులుల గురించి వివరిస్తున్న సీతా శ్రీనివాస్

తాటిచెట్లపాలెం: మానవాళిని రక్షించడంలో మేంగ్రోవ్స్ పాత్ర కీలకమని కథాకథన శిల్పి, వాయిస్ ఆర్టిస్ట్, రికార్డిస్ట్ ఎస్.సీత శ్రీనివాస్ అన్నారు. భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్‌తో కలిసి విశాఖ పబ్లిక్ లైబ్రరీ మియావాకి స్టోరీటైమ్ వీకెండ్ యాక్టివిటీలో భాగంగా ఆదివారం పౌర గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇటీవల జూలై 26న అంతర్జాతీయ మడ అడవుల సంరక్షణ దినోత్సవం, జూలై 29న అంతర్జాతీయ పులుల దినోత్సవం జరిగాయని, మానవ చరిత్రను రక్షించడంలో మేంగ్రోవ్స్, పులుల ప్రాధాన్యం ఎంతో ఉందని తెలిపారు. మడ అడవులు ప్రకృతి తీర రక్షకులుగా ఎలా తీరాలను కాపాడతాయో, నేల క్షీణతను తగ్గిస్తాయో, జలచరాలు, పక్షులకు ఆశ్రయంగా ఉంటాయో పిల్లలకు వివరించారు. ఇవి రాబోయే తరాల భద్రతకు ఎంత ముఖ్యమో తెలియజేశారు. పులి శక్తికి, పర్యావరణ సమతుల్యతకు చిహ్నంగా ఎలా ఆహార గొలుసులో కీలకపాత్ర పోషిస్తుందో, దాని సంరక్షణ ఎందుకు అవసరమో వివరించారు. పబ్లిక్ లైబ్రరీ కార్యదర్శి డి.ఎస్.వర్మ మాట్లాడుతూ మడ అడవులను సంరక్షించుకుంటే భవిష్యత్‌కు రక్షణగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ఆధ్యాత్మిక శోభ



కొమ్మాది: సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరం ఆదివారం 'హరే కృష్ణ, హరే రామ' నామస్మరణతో మార్మోగింది. వారాంతపు ప్రత్యేక పూజల సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షులు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలను, పలు ప్రవచనాలను ఆలపించారు. ఈ నేపథ్యంలో రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయస్వామి, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

అలరించిన వినోదాల విందు


స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

తాటిచెట్లపాలెం: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు అలరించింది. ఎం.వి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్‌రాజ్, కుమారి, పుష్పమ రాగస్ నాయుడు, నరసింహరావు, సూర్య, ఎస్ఎస్ నాయుడు, పోర్ట్ శేషులు లఘు నాటికలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. శేఖర్ కుమార్ అందించిన హాస్య గుళికలు వినోదాన్ని పంచాయి. ఓం శ్రీ గురు నృత్య కళానికేతన్ శిష్యులు శాస్త్రీయ నృత్యం చేసి అలరించారు. అనంతరం అతిథులకు, కళాకారులకు మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో తిలక్ పట్నాయక్, సన్ మూర్తి, బి.మాల్యాద్రి, రిటైర్డ్ డీజీఎం డాక్టర్ మీగడ శశిభూషణ స్వామి, ఎం.వి.సుబ్రహ్మణ్యం తదతరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ సేవలు ఆదర్శం


వాకర్స్ వాయిస్ పత్రికను ఆవిష్కరిస్తున్న ఆచార్య జీఎస్ఎన్ రాజు, క్లబ్ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య డాక్టర్ జీఎస్ఎన్ రాజు కొనియాడారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. నడక ద్వారా ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయడాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన వాకర్స్ వాయిస్ పత్రికను ఆవిష్కరించారు. నూతనంగా చేరిన 20 మంది సభ్యులతో డిస్ట్రిక్ట్–101 గవర్నర్ కె.ద్వారకానాథ్ ప్రమాణం చేయించారు. ఈ నెలలో పుట్టినరోజు జరుపుకుంటున్న సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ట్–101 ఆర్‌సీ–5 యు.శుభ, పూర్వ అధ్యక్షుడు ఎన్.బుచ్చయ్య, కార్యదర్శి సీహెచ్ఎస్ఎస్‌వీ ప్రసాదరావు, సహాయ కార్యదర్శి ఎన్.ప్రకాశరావు, కోశాధికారి ఆర్.నాగేశ్వరరావు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గురుద్వారాను సందర్శించిన పోలీస్ కమిషనర్


సింధియా గురుద్వారా దర్బార్‌లో చిన్నారులకు ప్రసాదం అందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

మల్కాపురం: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదివారం ఉదయం సింధియా న్యూకాలనీలోని సిక్కుల ఆరాధ్య దైవం గురునానక్ మందిరమైన గురుద్వారా దర్బార్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మత పెద్దల ఘన స్వాగతాన్ని అందుకున్నారు. మందిరంలో సిక్కులతో కలిసి పవిత్ర ప్రార్థనలు చేశారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా దర్బార్‌లో భక్తులకు సీపీ శుభాకాంక్షలను తెలిపారు. చిన్నారులతో కాసేపు ముచ్చటించి, వారికి చాక్లెట్లు, ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మైనారిటీల సంరక్షణకు ప్రభుత్వం, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. స్థానికంగా ఏ సమస్య వచ్చినా తక్షణం 79950 95799 నంబర్‌లో తనను సంప్రదించాలన్నారు. అనంతరం సిక్కు మత పెద్దలు సీపీ బాగ్చిని ఘనంగా సత్కరించారు. సిక్కు మతస్తులు, మల్కాపురం పోలీస్ స్టేషన్ సీఐ గొలగాని అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర వెనుకబాటుకు చంద్రబాబే కారణం

- ప్రజలను మోసగిస్తున్న కూటమి పాలకులు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు


జీవీఎంసీ 13వ వార్డులో వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభిస్తున్న కె.కె.రాజు

ఆరిలోవ: ఉత్తరాంధ్ర వెనుకబాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే కారణమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు ఆరోపించారు. జీవీఎంసీ 13వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. పార్టీ వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్ ఆధ్వర్యంలో ఆరిలోవ కాలనీ ఆఖరి బస్టాప్ సమీపంలోని దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం నుంచి శ్రీకాంత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో కె.కె.రాజు, నియోజకవర్గం సమన్వయకర్త మొల్లి అప్పారావు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం కె.కె.రాజు పార్టీ కార్యాలయం ప్రారంభించి సమావేశంలో మాట్లాడారు. కష్టకాలంలో పార్టీ కోసం కార్యాలయం ఏర్పాటు చేసిన వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్‌ను అభినందించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మోసపూరిత పాలన అందిస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. అమరావతిలో అభివృద్ధి చేస్తున్నానంటూ ఉత్తరాంధ్రను గాలికి వదిలేసి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీలో కష్టపడిన కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యకర్తలు ధైర్యంతో ఉండాలన్నారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి

ప్రస్తుతం కూటమి పాలనకు ప్రజలు విసిగిపోవడంతో ఆ పార్టీల నాయకులు ప్రజల ముందు తలెత్తుకోలేని పరిస్థితి నెలకొందని కె.కె.రాజు అన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రజల సమస్యలు తెలుసుకొని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రస్తుతం ప్రజలు వైఎస్సార్‌సీపీనే ఆదరిస్తున్నారన్నారు. 2029లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలంటే పార్టీ కార్యకర్తలంతా కష్టపడి పనిచేయాలన్నారు. అనంతరం నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు మాట్లాడుతూ వార్డులో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అంతా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఎలాంటి సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానన్నారు. కార్యకర్తలు అసంతృప్తి చెందవద్దని, మంచి రోజులు రానున్నాయని తెలిపారు. కార్యకర్తలకు ఏ సమస్య ఉన్నా తనకు నేరుగా తెలియజేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఒక కుటుంబమని తెలిపారు. ఆ కుటుంబంలో కార్యకర్తలంతా ఒకేతాటిపై పనిచేయాల్సిన అవసరం ఉందని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, ఎస్సీ సెల్ రీజినల్ అధ్యక్షుడు అల్లంపల్లి రాజబాబు, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కె.శిరీష, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు సురేష్, అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, రాష్ట్ర సోషల్ మీడియా ప్రతినిధి బెవర జగదీష్, పలు వార్డుల అధ్యక్షులు పాల్గొన్నారు.

స్నేహితుల సమ్మేళనంలో సందడే సందడి


స్నేహితుల దినోత్సవం సందర్భంగా కలుసుకున్న రైల్వే హైస్కూల్ 1987-88 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

అల్లిపురం: వారంతా ఎప్పుడో కలిసి చదువుకుని 47 ఏళ్ల వయసులో నెరిసిన జుట్టుతో కలుసుకున్నారు. వారిలో కొందరు అవ్వాతాతలు కూడా అయ్యారు. మరికొందరు పిల్లల పెళ్లిళ్లు కూడా చేసేశారు. బతుకుబండిలో ఏం సాధించామని ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే అన్నీ బరువులు, బాధ్యతలే కనిపించాయి వారికి. కుటుంబ పోషణ, సంసార సాగరం, ఉద్యోగ బాధ్యత, వ్యాపార లావాదేవీలు ఇలా ఎన్నో ఆటుపోట్ల నడుమ నలిగిపోతున్న జీవితం. వీటన్నింటినీ కాసేపు పక్కన పెట్టి స్నేహితుల సాన్నిహిత్యంలో గడిపితే లభించే ప్రశాంతతే వేరు. చిన్నప్పుడు కలిసి చదువుకున్న స్నేహితులందరూ ఒక్కొక్కరూ ఒక్కో ఊరు, రాష్ట్రం, దేశాల్లో జీవనం సాగిస్తున్న రోజులు ఉన్నాయి. ఇలాంటి పూర్వ విద్యార్థులందరూ ఆత్మీయ సమ్మేళనాల పేరిట కలుసుకొని స్నేహ బాంధవ్యాలను నిలుపుకుంటున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆహ్లాదంగా గడుపుతున్నారు. ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఒకేచోట కలుసుకొని 'అరేయ్', 'ఒరేయ్', 'ఏరా'అంటూ చిన్నప్పుడు పిలుచుకునే ఊత పేర్లతో పిలుచుకుంటూ ఆనందంగా గడుపుతున్నారు. నగరంలోని రైల్వే వైర్లెస్ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1987–88లో పదవ తరగతి చదివిన స్నేహితుల బృందం ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఒక హోటల్‌లో ఆదివారం ఘనంగా స్నేహితుల దినోత్సవం జరుపుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి సుమారు 50 మంది పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తమ ఆధ్వర్యంలో జరిగిన సామాజిక సేవా కార్యక్రమాలు సమీక్షించి భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించారు. అవసరంలో ఉన్న స్నేహితులకు ఆర్థిక సహాయం అందజేసే సంకల్పం కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బసవ శ్రీనివాస్, చామన విశ్వేశ్వరరావు, రవీంద్రనాథ్ పట్నాయక్, కె. గౌరీ శంకర్, ఆలూరి సంజీవికుమారి, భమిడిపాటి భవానీ, ఎల్.కల్యాణీ, నసీమా బేగం తదితరులు సారథ్యం వహించారు. ఆట పాటలు సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

వేడుకగా స్నేహితుల దినోత్సవం

డాబాగార్డెన్స్: పాతనగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో స్నేహితుల దినోత్సవం, యోగా శిక్షణ తరగతులు నెల రోజులు పూర్తయిన సందర్భంగా ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. యోగా మాస్టార్ గణేష్ నేతృత్వంలో యోగా శిక్షణ తరగతులు, భగవద్గీత శ్లోకాల అధ్యయనం చేశారు. స్నేహితుల దినోత్సవంలో భాగంగా విద్యార్థులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకున్నారు.

హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో హెరిటేజ్ ఫెస్ట్


చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులు

తగరపువలస: ఆనందపురం మండలం, గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద గల శ్రీరాధా మదన మోహన మందిరంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో హెరిటేజ్ ఫెస్ట్–2025 ఘనంగా జరుగుతోంది. 2న ప్రారంభమైన ఈ సాంస్కృతిక కార్నివాల్ ఈనెల 11వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది. ఆదివారం వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 600 మంది విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. సోమవారం పౌరాణిక వేషధారణ, భగవద్గీత శ్లోక పఠనం, మంగళవారం భగవద్గీత శ్లోక పఠనం,6న గాత్ర సంగీతం,7న నాటకాలు, 9న శాస్త్రీయ నృత్యాలు,11న కుండలపై పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్ వర్క్ పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 99853 64430, 87901 60232 నంబర్లలో సంప్రదించాలని హరేకృష్ణ వైకుంఠం ప్రతినిధి అంబరీష దాస కోరారు.